లక్ష్యం చేరని ఆస్తిపన్ను వసూళ్లు

పన్ను వసూలులో చతికిల పడిన జంట సర్కిళ్లు

● టార్గెట్‌లో కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో 89 శాతం, గాజులరామారంలో 93 శాతమే వసూలు



కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సరం 2023-24 ఆస్తి పన్ను వసూల్లో కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లు టార్గెట్‌ను రీచ్‌కాలేదు. ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో సర్కిల్ అధికారులు చతికిలపడ్డారు. ప్రభుత్వం ఆస్తిపన్ను వసూల్లో మొండిబకాయిలను కూడా చెల్లిచేలా ఓటీఎస్ (వన్ టైం స్కీమ్) పథకాన్ని ప్రవేశపెట్టినా అనుకున్న స్థాయిలో వసూళ్లు రాలేదు. లక్ష్యాలను చేరుకునేందుకు తీవ్రస్థాయిలో అధికారులు కృషి చేసినా ఫలితం దక్కలేదు. ఓ పక్క ఆస్తి పన్ను కలెక్షన్...మరో పక్క ఎలక్షన్ విధులు...మధ్యలో ప్రజాపాలన అభయ హస్తం విధులతో జీహెచ్‌ఎంసీ అధికారులు సతమతమయ్యారు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ, ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలవిధులతో జీహెచ్‌ఎంసీ ఆదాయంపై తీరనిప్రభావం పడింది.

ఎన్నికల విధుల్లో రెవెన్యూ యంత్రాంగం

అసెంబ్లీ ఎన్నికల్లో రెవెన్యూ అధికారులకు పూర్తి స్థాయిలో విధులు కేటాయించారు. దీంతో ఆస్తిపన్ను వసూళ్లపై కుత్బుల్లాపూర్ సర్కిల్, గాజులరామారం సర్కిల్ అధికారులు దృష్టి కేంద్రీకరించలేకపోయారు. ఎన్నికల అనంతరం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ, అనంతరం వాటి కంప్యూటరీకరణ విధుల్లో తలమునకలయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటరు సవరణలో భాగంగా సర్వేలను కూడా వీరే నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితా పరిశీలన, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, కావాల్సిన సదుపాయాల ఏర్పాట్లు, స్లిప్పుల పంపిణీతో పాటు ఇతరత్రా విధుల్లో రెవెన్యూ యంత్రాంగం కీలకంగా వ్యవహరించింది. దీని ప్రభావం ఆస్తిపన్ను వసూళ్లపై పడింది. అనంతరం ఆస్తిపన్ను వసూళ్లపై దృష్టి కేంద్రీకరించి లక్ష్యాలను చేరుకునేందుకు సిద్ధంకాగా...లోక్‌సభ ఎన్నికల రూపంలో విధులను కేటాయించారు. అటు కలెక్షన్...ఇటు ఎలక్షన్ విధులకు ఎటువంటి భంగం కలగకుండా విధులు నిర్వహించాలనే ఆదేశాలు ఉన్నతాధికారులు జారీచేసినట్లు ఓ అధికారి తెలిపారు. దీంతో సరిపడినంత యంత్రాంగం లేక సతమతమవుతున్న రెవెన్యూ విభాగంలో ఎన్నికల అదనపు విధులు వచ్చి పడ్డాయి. ఒకే ఆర్థిక సంవత్సరంలో అప్పుడు సాధారణ ఎన్నికలు, ఇప్పుడు సార్వత్రిక ఎన్నికల ప్రభావం ఆస్తిపన్ను వసూళ్లపై తీవ్రస్థాయిలో పడింది.

జంట సర్కిళ్లలో వసూళ్లు ఇలా

కుత్బుల్లాపూర్ సర్కిల్‌కు 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.57.38 కోట్ల ఆస్తిపన్ను వసూళ్లు చేయాలని ఉన్నతాధికారులు లక్ష్యాలను నిర్దేశించారు. ఈ మేరకు కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని 9 డాకెట్లకు గాను మొత్తం 43,654 అస్సులకు రూ.53.59 కోట్ల (89 శాతం) ఆస్తిపన్నును అధికారులు వసూలు చేశారు. అలాగే గాజులరామారం సర్కిల్‌కు 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.34.97 కోట్ల ఆస్తిపన్ను వసూళ్లు చేయాలని ఉన్నతాధికారులు లక్ష్యాలను నిర్దేశించారు. ఈ మేరకు గాజులరామారం సర్కిల్ పరిధిలోని 7డాకెట్లకు గాను మొత్తం 37,154 అస్సులకు రూ.32.70 కోట్ల (93 శాతం) ఆస్తిపన్నును వసూలుచేశారు. ఓటీఎస్ పథకం ఇస్తేనే ఈ రకంగా ఆస్తిపన్ను వసూళ్లు ఉంటే ఒకవేళ ప్రభుత్వం ఓటీఎస్ ప్రకటించకపోతే పరిస్థితి ఎంత దారుణంగా ఉండేదో కదా... అని పలువురు అధికారులే ఆశ్చర్యానికి గురయ్యారు. జంట సర్కిళ్లు లక్ష్యాలను చేరుకోనప్పటికీ జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్ పరిధిలో ఆస్తిపన్ను వసూల్లో గాజులరామారం తృతీయస్థానంలో, కుత్బుల్లాపూర్ నాల్గోస్థానంలో నిలిచాయి.

సీఎంకు బీసీలందరూ రుణపడి ఉంటాం


రేవంత్ రెడ్డితో మహేందర్

దుండిగల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో బీసీ కులజనగణన తీర్మానం చేసి జీఓ నెం 26ను విడుదల చేసినందుకు బీసీ సమాజం తరుపున సీఎం రేవంత్‌రెడ్డిని సోమవారం బీసీ ఐక్య వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆరే.మహేందర్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50 శాతం ఇవ్వాలని సీఎంను కోరారు. బీసీలకు 13 కార్పొరేషన్లను ఏర్పాటు చేసినందుకు బీసీలందరూ రుణపడి ఉంటామన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేత


భాస్కర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న రంజిత్‌రెడ్డి

హైదర్‌నగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సీహెచ్ భాస్కర్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్ల రామకృష్ణగౌడ్, అనిల్‌రెడ్డి, యాదగిరి, పోశెట్టిగౌడ్, అనిల్‌రెడ్డి, మోజెస్, రవీందర్, రాజు, బాలస్వామిసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో బండి రమేష్


ఇఫ్తార్‌లో బండి రమేష్‌తో మైనారిటీ నాయకులు

ఓల్డుబోయినపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ హిందు, ముస్లింల సోదరభావానికి ప్రతీకని కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఓల్డుబోయినపల్లి డివిజన్‌కు చెందిన మైనారిటీ నాయకుడు ఎమ్‌డీ అస్లాం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ నాయకులు శేరి సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.


నియామక పత్రాలతో కాంగ్రెస్ కమిటీల మహిళలు

అన్ని డివిజన్లకు కాంగ్రెస్ మహిళా కమిటీల నియామకం

నిజాంపేట్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్లకు మహిళా కాంగ్రెస్ కమిటీల నియామకం జరిగింది. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునితాముగిలిరావు ఆదేశాల మేరకు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి అధ్యక్షతన సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్‌ల్లో మహిళా కమిటీలను రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షు రాలు ఇందిర సమక్షంలో ఏర్పాటు చేశారు. వారందరికీ కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి పట్నం సునితా మహేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, నిజాంపేట్‌కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి షేక్‌రఫియాబేగం, సెక్రటరీ జాజుల రమ్య, అన్ని డివిజన్ల కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌లతో విస్తృత ప్రయోజనాలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): విజ్ఞానదాయక అంశాలపై వర్క్‌షాప్‌లు నిర్వహించడం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని జేఎన్‌టీయూ రెక్టార్ డాక్టర్ కె.విజయకుమార్‌రెడ్డి అన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన "క్వాడ్‌కాప్టర్" వర్క్‌షాప్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న పాఠ్యాంశాలను వర్క్‌షాప్‌లో పరిశీలన చేసే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఇ.రాంజీ, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు డాక్టర్ భ్రమర, డాక్టర్ ప్రసన్న, బ్రహ్మోస్త్ర సంస్థ ప్రతినిధులు సుభాష్ కుప్పుస్వామి, విష్ణు, స్టూడెంట్ కోర్డినేటర్లు రణధీర్, సాయివిశాల్, శ్రీజారెడ్డి, మనస్వి తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి పీహెచ్‌డీ దరఖాస్తుల పరిశీలన

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పీహెచ్‌డీ) అడ్మిషన్లకు ఎట్టకేలకు కదలిక వచ్చింది. దరఖాస్తు గడువు ముగిసి నెలరోజులైనా పరిశీలనను(స్క్రూటినీ) ప్రారంభించకపోవడంపై 'నత్తనడకన పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ' శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు స్పందించారు. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను మంగళవారం నుంచి ప్రారంభించాలని అడ్మిషన్ల విభాగం డైరెక్టర్ వెంకటరామిరెడ్డిని ఆదేశిస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. సబ్జెక్టుల వారీగా దరఖాస్తుల పరిశీలన బాధ్యతలను బోర్డు ఆఫ్ స్టడీస్(బీఓఎ్‌స)లకు అప్పగించాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలనను 10రోజుల్లోగా పూర్తిచేసి, నెలాఖరు కల్లా ప్రవేశపరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు షెడ్యూల్‌ను రూపొందించాలని డైరెక్టర్‌ను.. రిజిస్ట్రార్ ఆదేశించినట్లు తెలిసింది.

దూలపల్లిలో కుక్కల నుంచి కాపాడాలి

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): దూలపల్లిలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, వీటి బారి నుంచి కాపాడాలని మున్సిపల్ కమిషనర్ శ్రీహరికి సోమవారం కాంగ్రెస్ నాయకులు చంద్రనాయక్ వినతిపత్రం అందజేశారు. దూలపల్లి 14, 15 వార్డుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ, రహదారి వెంట వెళుతున్న చిన్నారులు, ద్విచక్ర వాహనదారులపై వెళుతున్న వారిని పరుగులు పెట్టిస్తున్నాయన్నారు. గతంలో ఈ ప్రాంతంలో కుక్కలు కరిచాయన్నారు. అధికారులు స్పందించి కుక్కలను పట్టుకెళ్లాలని చంద్రానాయక్ కోరారు.

కార్మికుని కుటుంబానికి ఆర్థిక సహాయం

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని సూరారంలో మోడీ అపార్టుమెంట్స్ బిల్డర్స్ భవన నిర్మాణ పనుల్లో ప్రమాదవశాత్తు గతనెల 19న కార్మికుడు జి.సత్యనారాయణ మృతి చెందాడు. యాజమాన్యంతో బీఆర్ఎస్ కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ చర్చించి బాధిత కుటుంబానికి రూ.8లక్షల చెక్కును ఇప్పించారు. ఈ కార్యక్రమంలో అనిల్, శ్రీనివాస్‌చారీ, సుదర్శన్, జగన్, ప్రేమ్ తదితరులు ఉన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన కార్పొరేటర్


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి, ఓసీ సంఘం అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి తదితరులు

బాలానగర్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): చలివేంద్రాలు పేదప్రజల దాహార్తిని తీర్చుతాయని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, తెలుగు రాష్ట్రాల ఓసీ సంఘం అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం బాలానగర్ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బాలానగర్‌లో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, జనరల్‌సెక్రెటరీ వెంకట్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, సంఘం సభ్యులు ఆనంద్‌రెడ్డి, మందడి సుధాకర్‌రెడ్డి, మాజీకౌన్సిలర్ శంకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి కొత్త దామోదర్ రెడ్డి, సులోచనారెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అంతర్గత సమస్యలకు బాధ్యులను చేయొద్దు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరా అంతరాయాలకు తమ తప్పిదం లేకున్నా.. విద్యుత్ సంస్థల యాజమాన్యాల, అధికారుల, ఇంజనీర్ల సిబ్బంది లోపంగా అసత్య ప్రచారం చేస్తూ, అంతర్గత విద్యుత్ సమస్యలకు తమను బాధ్యులను చేయొద్దని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. జేఏసీ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్ తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్-1104 కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. జేఏసీ చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ పి.రత్నాకర్‌రావు, కోకన్వీనర్ వి.బీసీ రెడ్డి, వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని కేటగిరీల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు కృషిచేస్తున్నామన్నారు.

పేద మహిళకు కార్పొరేటర్ సాయం

హైదర్‌నగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ ఎల్లమ్మబండ ఎన్టీఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్న అక్తర్‌బేగం సయ్యద్ ఇల్లు శనివారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఇంట్లో సామగ్రి, దుస్తులు కాలిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సోమవారం ఆమెను పరామర్శించారు. నిత్యావసరాలను, ఆర్థికసాయం అందజేశారు.


కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

ఘనంగా మల్లన్న కల్యాణ మహోత్సవం

మియాపూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): హఫీజ్‌పేట డివిజన్ మదీనగూడలోని మల్లికార్జునస్వామి దేవాలయంలో మల్లికార్జునస్వామి, భ్రమరాంబదేవి, క్యాతమ్మ దేవతల కల్యాణ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ హఫీజ్‌పేట, మాదాపూర్ డివిజన్ల అధ్యక్షులు బాలింగ్‌గౌతమ్‌గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, హోప్‌ఫౌండేషన్ చైర్మన్ విజయ్, బీఆర్ఎస్ నాయకులు దాత్రినాథ్‌గౌడ్, రామకృష్ణగౌడ్, మహేందర్‌ముదిరాజ్, సాయిగౌడ్, వెంకటేష్‌గౌడ్ బాబు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి


కేపీహెచ్‌బీకాలనీలో వాకర్స్‌తో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

కూకట్‌పల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు మరోసారి కారు గుర్తుకు ఓటేయాలని ఆ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కోరారు. సోమవారం బాలాజీనగర్ డివిజన్‌లోని కేపీహెచ్‌బీకాలనీలో గల వివిధ పార్కుల్లోని వాకర్స్‌తో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. పదేళ్లలో కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అన్ని కాలనీలు, బస్తీల్లో మౌలికవసతులు కల్పించామన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అండగా నిలబడాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శిరీష, జూపల్లి సత్యనారాయణ, నాయకులు బాబురావు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బడే మసీద్ ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కృష్ణారావు

ఓల్డుబోయినపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రంజాన్ సందడే లేకుండా పోయిందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం రాత్రి ఓల్డుబోయినపల్లి హస్మత్‌పేట్ పెద్ద మసీద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో అన్ని డివిజన్ల కార్పొరేటర్లతో కలిసి ఎమ్మెల్యే, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ముద్దం నర్సింహ్మాయాదవ్, జూపల్లి సత్యనారాయణ, సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను వేధిస్తున్న కళాశాలపై చర్యలు తీసుకోవాలి


ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు వినతి పత్రం ఇస్తున్న ఓయూ జేఏసీ కమిటీ సభ్యులు

దుండిగల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): దూలపల్లిలోని ఓ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థికంగా, విద్యార్థులను వివిధ రకాలుగా వేధిస్తోందని ఓయూజేఏసీ రాష్ట్ర అధ్యక్షులు గడ్డం శ్రీరామ్ ఆరోపించారు. అక్రమంగా ఫీజులను అధికంగా వసూలు చేస్తున్న ఈ కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రికి ఫిర్యాదు చేశారు. ఆలస్యంగా వచ్చిన విద్యార్థుల నుంచి రోజుకు రూ.50 చొప్పున లేటుఫీజు వసూలు చేస్తున్నారని చైర్మన్‌కు వివరించారు. డబ్బులు కట్టని విద్యార్థులకు ఐడీకార్డు ఇవ్వకుండా మరుసటి రోజు కాలేజీ లోపలికి రానివ్వకుండా గేటు వద్దనే ఆపేస్తున్నారని ఆరోపించారు. 5 వేల మంది విద్యార్థుల నుంచి కేవలం ఇంటెన్సివ్ ప్రాజెక్టుపేరుతో రూ.3కోట్లు వసూళ్లు చేస్తున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉన్న విద్యార్థి నుంచి కూడా రూ.20వేలు వసూళ్లు చేస్తున్నారని, ఇలా డబ్బు విషయంలో చాలా రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. విద్యార్థుల నియమ నిబంధనలకు వ్యతిరేకంగా ఫీజులు వసూళ్లు చేస్తున్న ఇంజనీరింగ్ కాలేజీ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ సురేందర్, కార్యదర్శి సంతు ఉన్నారు.

జాగ్రత్తలతో అగ్నిప్రమాదాల నివారణ : ఏసీపీలు


మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాసరావు


సమావేశమైన ఏసీపీ హన్మంతరావు, సీఐ నవీన్ కుమార్

కూకట్‌పల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ముందస్తు భద్రతాచర్యలు తీసుకుంటే అగ్నిప్రమాదాలను నివారించవచ్చని కూకట్‌పల్లి ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు అన్నారు. కూకట్‌పల్లిలోని ఎస్‌కేఎస్‌ఆర్ గార్డెన్స్‌లో పరిశ్రమలు, గోదాం, కమర్షియల్ భవనాల నిర్వాహకులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. వేసవికాలంలో సంభవించే అగ్నిప్రమాదాలను పూర్తిస్థాయిలో నివారించేందుకు ఫైర్‌సేఫ్టీ, పోలీసు అధికారుల సూచనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బాచుపల్లి పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు కృష్ణమోహన్, శ్రీనివాసరావు, ఉపేందర్‌రావు, ఎస్సైలు పాల్గొన్నారు.

● **బాలానగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):** ఎండల తీవ్రత పెరుగుతున్న క్రమంలో పారిశ్రామికవాడల్లోని పరిశ్రమల నిర్వాహకులు అగ్నిప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బాలానగర్ ఏసీపీ హన్మంతరావు సూచించారు. సోమవారం మధ్యాహ్నం ఏసీపీ కార్యాలయంలో బాలానగర్ (ఏసీపీ పరిధి)లో ఉన్న కెమికల్‌పరిశ్రమలు, ఇతరపరిశ్రమల నిర్వాహకులతో కలిసి సమావేశం ఏర్పాటుచేసి పలు సూచనలు చేశారు. ఫైర్‌సేఫ్టీకి సంబంధించిన పరికరాలను సిద్ధంచేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో బాలానగర్ సీఐ నవీన్‌కుమార్ సనత్‌నగర్, జీడిమెట్ల ఫైర్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు ప్రదీప్, సుభాష్‌రెడ్డి, పలు పరిశ్రమల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా శిఖర ప్రతిష్ఠ

మాదాపూర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య పాటల ప్రచారం కోసం శోభరాజు చేసిన కృషి వల్ల ఆమె జన్మ చరితార్థమయిందని చాగంటి కోటేశ్వరరావు అన్నారు. మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో వేంకటేశ్వరస్వామి వారికి శిఖరప్రతిష్ఠ, కుంభాషేకం, సోమవారం కలశపూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వక్తలు చాగంటి కోటేశ్వరరావు, విశ్వయోగి విశ్వంజీ మహారాజు, వాదిరాజాచార్యస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మశ్రీ భోజారాజు వద్ద శిక్షణ విద్యార్థులు ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు ఆకట్టుకున్నాయి.

ఆలయ భూమిలో అక్రమ నిర్మాణం

హైదర్‌నగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కాదేది కబ్జాకు అనర్హం అని దేవుడి భూములను సైతం భూ బకాసురులు చెరబడుతున్నారు. లక్షల విలువ చేసే ఆలయ స్థలాన్ని ఓ భూ బకాసురుడు కబ్జా చేసి అమ్ముకొని సొమ్ము చేసుకున్నాడు. అధికారులు ఎన్నికల పనుల్లో ఉంటారని, ఇదే అదనుగా భావించి స్థలాన్ని కొనుగోలు చేసిన వ్యక్తి గుట్టుచప్పుడు కాకుండా ఆగమేఘాల మీద నిర్మాణాన్ని చేపట్టాడు. కూకట్‌పల్లి మండల పరిధిలోని 336 సర్వేనెంబర్‌లో భూదేవిహిల్స్‌ను ఆనుకొని లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉంది. ఆలయ గుట్టను ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాన్ని కబ్జాదారుడు కబ్జాచేసి విక్రయించాడు. ఈ ప్రాంతంలో ఆలయ నిర్వాహకులు గోశాల కట్టాలని నిర్ణయించారు. అక్కడ ఇంటి నిర్మాణం జరుగుతుండంతో స్థానికులు, భక్తులు, సంక్షేమ సంఘాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.


హోమం పూర్ణాహుతిలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ విజయ్‌శేఖర్‌గౌడ్

ఘనంగా అమ్మవారి విగ్రహ పున:ప్రతిష్ఠ మహోత్సవం

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డినగర్ డివిజన్‌లోని విజయనగర్ కాలనీలోని పోచమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ పున:ప్రతిష్ఠ మహోత్సవం మూడు రోజుల నుంచి వైభవంగా జరుగుతోంది. సోమవారం నిర్వహించిన మహాగణపతి, పూజా శాంతి హోమం, మహాపూర్ణాహుతికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కార్పొరేటర్ విజయ్‌శేఖర్‌గౌడ్ హాజరై పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామదేవతలను పూజించడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎ.శంకరయ్య, విజయ్‌నగర్ కాలనీవెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ రియాజ్, ప్రధానకార్యదర్శి మల్లం శ్రీనివాస్‌గౌడ్, బాలు, శ్రీధర్, సుజాత, చంద్రశేఖర్‌గౌడ్, శేషి నర్సింహాగౌడ్, భాస్కర్‌గౌడ్, లక్ష్మణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన సంగీత, నృత్య మహోత్సవం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

మియాపూర్, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని సీసీఆర్‌టీలో సంగీత, నృత్య మహోత్సవం రామాయణ కల్పవృక్షం సోమవారంతో ముగిసింది. ఈ ఉత్సవాల్లో ప్రసిద్ధి చెందిన కళాకారులు తమ అద్భుత ప్రదర్శనతో ప్రేక్షకులను అలరించారు. చర్చలు, వర్క్‌షాపులు, సంస్కృతం, డిజిటల్ కళలు, పుస్తక ఆవిష్కరణలను చేశారు. చివరిరోజు కార్తీక్ అయ్యర్ త్రిల్లింగ్ సంగీతం ప్రేక్షకులను విశేషంగా అలరించింది. అనంతరం రిజాయిసింగ్ ఇన్ రఘు బ్యాండ్ ఫ్యూజన్ కర్ణాటక సంగీతం అందరినీ మంత్రముగ్ధులను చేసింది. ఈ సందర్భంగా రామాయణ కల్పవృక్షం క్యూరేటర్ ఆనందశంకర్‌జయంత్ మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక గురువులు తమ వీడియో సందేశాలను పంపడం సంతోషంగా ఉందన్నారు.

పవర్‌లిఫ్టింగ్‌లో శిల్పకు రజతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో హైదరాబాద్ లిఫ్టర్ డి.శిల్ప రజతపతకం సాధించింది. సోమవారం ఢిల్లీలో జరిగిన పోటీల్లో మాస్టర్స్ విభాగం 90 కిలోల విభాగంలో శిల్ప ద్వితీయ స్థానంలో నిలిచింది. శిల్ప స్క్వాట్‌లో 85, బెంచ్‌లో40, డెడ్‌లిఫ్ట్‌లో102.5, మొత్తంగా 227.5 కిలోల బరువెత్తి రజతంతో మెరిసింది. రుచి(ఢిల్లీ) స్వర్ణం సాధించింది. తెలంగాణ డబ్ల్యూపీసీ పవర్‌లిఫ్టింగ్ సంఘం అధ్యక్షురాలు ఇంటూరి రేఖ, శిల్పను అభినందించింది.

గంజాయి విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

రాయదుర్గం,ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): నానక్‌రాంగూడలో కిరాణాషాపులో గంజాయి విక్రయిస్తున్న ఓ మహిళను మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. ఆమె నుంచి 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నానక్‌రాంగూడలో కిరాణాషాపు నడుపుతున్న అనురాధభాయి కొంతకాలంగా గంజాయి కూడా విక్రయిస్తోందని మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆదివారం రాత్రి కిరాణాషాపుపై దాడిచేసి 39ప్యాకెట్లల ఉన్న 300గ్రాముల గంజాయిని, రూ.1200, సెల్‌ఫోను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితురాలని గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపారు.

మానసిక పరిస్థితి సరిగా లేని వ్యక్తి ఆత్మహత్య

గాజులరామారం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మానసిక పరిస్థితి సరిగా లేని ఓ వ్యక్తి ఉరేసుకొని మృతి చెందాడు. సూరారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటున్న నర్సింహ కుమారుడు దత్త(30)భార్య, భర్త ఇద్దరూ గొడవపడ్డారు. దత్త తన ఎడమచేతి మణికట్టు వద్ద కోసుకొని, తన గది తలుపులు వేసుకొన్నాడు. బయట ఉన్న తల్లి, భార్య తలుపులు కొట్టినా తీయలేదు. దీంతో పోలీసులకు తెలిపారు. పోలీసులు గది తలుపులు పగలగొట్టి చూడగా చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొన్నాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. నెల నుంచి తన కుమారుడు పిచ్చిగా ప్రవర్తిస్తున్నాడని, అతని మృతినిపై ఎవరికీ అనుమానం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇనుప రాడ్లు తగిలి కార్మికుడి మృతి

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): క్రేన్ బెల్ట్ ఊడిపోయి ఇనుపరాడ్‌లు తగిలి ఓ కార్మికుడు మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం బిహార్‌కు చెందిన ఓమ్‌ప్రకాష్‌మహతో(49) కుటుంబ సభ్యులతో బతుకుదెరువు కోసం నగరానికి వలసొచ్చాడు. దూలపల్లి పారిశ్రామికవాడలోని భవాని గాల్వనైజింగ్ పరిశ్రమలో క్రేన్ హెల్పర్‌గా పని చేస్తూ అక్కడే ఉంటాడు.

పనిచేస్తున్న సమయంలో క్రేన్ బెల్ట్ ఊడిపోయి ఇనుపరాడ్‌లు అతనికి తగలడంతో కార్మికులు, పరిశ్రమ యాజమాన్యం సుచిత్రలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.